# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 21-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:88 పేజీలు:6 వెల: రూ.1/-


## ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం : సీఎం కేసీఆర్

స్టేషన్ ఘన్‌పూర్ , నవంబర్ 20:టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కడియం శ్రీహరికి మద్దతుగా ప్రసంగించారు.ఆర్టీసీ బిడ్డలు ఉన్నారు. వాళ్లది పాపం ఎప్పుడు ఉద్యోగం పోతదో తెల్వదు. ఒక అభద్రతా భావం. ఆర్టీసీ బిల్లు పాస్ చేసినం. అది గవర్నర్ ఆలస్యం చేయడం వల్ల అది కొంత ఆలస్యమైంది. ఎలక్షన్ తెల్లారే ఆర్టీసీ బిడ్డలను రెగ్యులరైజ్ చేసి గవర్నమెంట్ ఉద్యోగస్తులుగా చేస్తాం అని కేసీఆర్ ప్రకటించారు.

మన వద్ద లక్షల మంది ఆటో రిక్షా బిడ్డలు ఉన్నారు. ఇండియా మొత్తంలో ఆటో రిక్షాలకు ట్యాక్స్ ఉంది. ఒక్క తెలంగాణ రాష్ట్రంలో లేదు. వారు పేదవాళ్లు బతుకుతున్నారని ట్యాక్స్ మినహాయింపు ఇచ్చాం. వాళ్లకు ఇంకో సమస్య ఉంది. ఏందంటే ఫిట్‌నెస్ కోసం పోతే ఏడాదికి రూ. 1200 కట్టాల్సి వస్తుంది. అది కూడా ఎలక్షన్ తెల్లారి రద్దు చేస్తామని చెబుతున్నా. ఆటో రిక్షా కార్మికులకు కూడా ఫిట్‌నెస్ ట్యాక్స్, పర్మిట్ ట్యాక్స్ రద్దు చేస్తాం. జీరో చేస్తాం. ప్రభుత్వానికి రూ. 100 కోట్ల నష్టం వస్తది అయినా పర్వాలేదు. వాళ్లు పేదవాళ్లు ఐదారు లక్షల మంది ఆటో నడిపి బతికేవారు ఉన్నారు. వాళ్ల సంక్షేమం కోసం అది కూడా చేస్తామని కరీంనగర్‌లో ప్రకటన చేశాను.

## ఇండోర్ స్టేడియం కూలి ముగ్గురు మృతి.. రంగారెడ్డి జిల్లాలో ఘటన



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం స్లాబ్ కూలి ముగ్గురు మృతి చెందారు. 12 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు బిహార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన కూలీలుగా గుర్తించారు. రాజేందర్ నగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఒక మృతదేహాన్ని గుర్తించామని తెలిపారు. శిథిలాల నుంచి మరో మృతదేహాన్ని వెలికితీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

## రైతు బంధు ఆపాలని ఎవరి నుంచి తమకు ఫిర్యాదులు అందలేదు

### - కేసీఆర్ సర్కార్‌కు ఝలక్ ఇచ్చిన ఈసీ ఝలక్

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏ చిన్నపాటి అవకాశం వచ్చినా సరే.. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. బీఆర్ఎస్ మాత్రం సరిగ్గా ఎన్నికల సమయంలో రైతులు, ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలో రైతుబంధు, ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు, రైతు రుణమాఫీలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కేసీఆర్ సర్కార్ సంప్రదించింది. అయితే.. ఈ విజ్ఞప్తులను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. పెండింగ్ డీఏలు ఇప్పుడు ఎలా ఇస్తారు..? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసీ ప్రశ్నించింది. దీంతో కేసీఆర్ సర్కార్‌కు ఈసీ ఝలక్ ఇచ్చినట్లయ్యింది. నిన్న, మొన్నటి వరకూ రైతుబంధు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలాయి. రైతన్నలకు రైతుబంధు ఇస్తామంటే.. కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేశారని బీఆర్ఎస్ పెద్దలు ఆరోపించారు. అంతేకాదు.. కాంగ్రెస్ అడుగడుగునా ఇలా అడ్డంకులు సృష్టిస్తోందని ఒకరిపై ఒకరు కౌంటర్లు ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే రైతు బంధు ఆపాలని సైతం ఎవరి నుంచి తమకు ఫిర్యాదులు ఇప్పటివరకూ అందలేదని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ మీడియాకు వెల్లడించారు. ఇప్పుడు తాజాగా పై విధంగా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈసీ ప్రకటనపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో చూడాలి మరి.

## అభివృద్ధిని చూసి ఓటు వేయాలి..మాయమాటలు నమ్మి ఆగం కావద్దు : మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్, నవంబర్ 20: సీఎం కేసీఆర్ అందించిన పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, మాయమాటలు నమ్మి ఆగం కాకుండా అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థి,మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని సోమారం, ఎల్లంపేట, సైదోనిగడ్డ తండా, రావల్‌కోల్ గ్రామాల్లో సోమవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే తెలంగాణలోనే జరిగిందని, ఇతర రాష్ట్రాల వారు మన అభివృద్ధిని చూసి నేర్చుకునే విధంగా సీఎం కేసీఆర్ పని చేశారన్నారు.తండాలు, పల్లెలను సీఎం కేసీఆర్ పంచాయతీలుగా మార్చడంతో అవి అభివృద్ధి దిశలో పయనిసున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి మోసం చేసే వారిని నమ్మొద్దని, 50 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదని, ప్రజలను వంచించి సర్వనాశనం చేసిందని ఆరోపించారు. ఒక్క ఓటు వేసి తనను గెలిపిస్తే వచ్చే ఐదేండ్లు ప్రజల సేవ చేసుకుంటూ ఉంటానని, అందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులను సస్పెండ్ చేసిన ఎస్ఈ

అమరావతి, నవంబర్ 20:విద్యుత్ అధికారులను ఎస్ఈ సస్పెండ్ చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈనెల15వ తేదీన నదికైరవాడిలో విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తో ముగతి గ్రామానికి చెందిన నబీరసూల్ మృతి చెందారు. దీంతో సోమవారం ఎస్ఈ ఉమాపతి నందవరం విద్యుత్ ఏఈ రవీంద్ర ను సస్పెండ్ చేశారు. ఇప్పటికే లైన్ మెన్, లైన్ ఇన్స్పెక్టర్ లపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం విధితమే.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ మొదటి తపాలా బిళ్లను
ముదమున అచ్చొత్తినట్టి పుట్టినదినముగా
విడుదల చేయించుచు నుందురు
...ముగా నవంబరిరువదియొకటిన!!



-రాధశ్రీ

(నవంబర్ 21 స్వతంత్రభారతంలో మొదటి తపాలా బిళ్ల విడుదల అయిన రోజు...)

సెల్:9494481210

## అది భూమాతనా..? భూమేతనా..? కాంగ్రెస్ మేనిఫెస్టోపై సీఎం కేసీఆర్ సెటైర్లు



మానకొండూరు, నవంబర్ 20: కాంగ్రెస్ మేనిఫెస్టోపై ముఖ్యమంత్రి కేసీఆర్ సెటైర్లు వేశారు. ధరణిని తీసేసి భూమాత పెడుతామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.. అది భూమాతానా..? భూమేతనా..? అని కేసీఆర్ విమర్శించారు. మానకొండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రసంగించారు.

అధికారంలోకి వస్తే మూడే గంటలు కరెంట్ ఇస్తమని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కర్ణాటకలో 20 గంటల కరెంట్ ఇస్తమని నరికారు.. కానీ 3 గంటలే ఇస్తున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన డీకే శివకుమార్.. కేసీఆర్ కర్ణాటకలో 5 గంటల కరెంటో ఇస్తున్నామని అంటే.. సన్నాసి కొడుకా 24 గంటలు ఇస్తున్నామని చెప్పిన.. దయచేసి అందరూ ఆలోచించాలి. ఇది రైతుల యొక్క జీవన్మరణ సమస్య. ఓట్లు అంటే మమూలు విషయం కాదు. అందుకే చెప్పిన ఓటు మన తల రాత మారుస్తది. ఐదేండ్ల భవిష్యత్‌ను నిర్ణయిస్తది. జాగ్రత్త అని కేసీఆర్ సూచించారు.

### ధరణి ఎత్తేస్తే మళ్లీ దళారుల రాజ్యం..

ధరణి తీసి బంగాళాఖాతంలో వేస్తరట కాంగ్రెసోళ్లు. వాళ్లు వస్తే వచ్చినాటికి సచ్చినాటికి కానీ. కాంగ్రెస్ మాటలను మీరంతా విమర్శించాలి. ధరణి తీసి బంగాళాఖాతంలో వేసి భూమాత పెడుతరట. అది భూమాతనా.. భూమేతనా..? మళ్లా వీఆర్వోలను తీసుకొస్తాం. 34 కాలమ్స్ పెడుతాం. కౌలుదార్ల కాలం పెడుతాం. అంటే రైతులకు కౌలుదార్లకు జుట్లు జట్లు ముడేస్తర..? ధరణి తీస్తే రైతుబంధు ఎలా వస్తుంది. మళ్లా వీఆర్వోలు, అగ్రికల్చర్ ఆఫీసర్ల సంతకం, సర్టిఫికెట్ తీసుకురా అంటరు. మళ్లీ లంచాలు, దళారీల రాజ్యం, వీఆర్ఎవోల రాజ్యం వస్తది అని కేసీఆర్ మండిపడ్డారు.

### మన బతుకే ఉద్యమమా..?

మీ భూముల మీద యాజమాన్యం మీ చేతుల్లో లేకుండే. పెత్తనం ఆఫీసర్లది ఉండే. ఇప్పుడే హక్కులు మీకే ఇచ్చాం. మీ బొటనవేలితో మీ భూమి హక్కు మారుతుది. మీ భూమిని సీఎం కూడా మార్చలేడు. మరి ఇంత మంచిగా ఉన్న అధికారాన్ని తీసి ఉంచుకుంటారా..? పొడగొట్టు కుంటారా..? దయచేసి నిర్ణయం చేయాలి. ఆలోచన చేయాలి. మళ్లా ధర్నాలు, నిరసనలు, బాలకిషన్ పాటలు.. మన బతుకే ఉద్యమమా..? గత పదేండ్ల నుంచి 70 ఏండ్లలో లేనంత శాంతంగా ఉంది తెలంగాణ. ఎవరికి తోచిన పని వారు చేసుకుంటున్నారు. వ్యవసాయ రంగం కుదుటపడ్డది. రైతుల ముఖాలు తెల్లవడ్డాయి. గ్రామాల్లో ఇండ్లు కట్టుకున్నాం. పల్లెల్లో పల్లె దవాఖానాలు, బస్తీల్లో బస్తీ దవాఖానాలు, నియోజకవర్గంలో 100, 200 పడకల దవాఖానాలు, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం అని కేసీఆర్ తెలిపారు.

## అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ ఎర్రం నర్సింగ్ రావు మృతి



హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సీనియర్ జర్నలిస్ట్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి ఎర్రం నర్సింగ్ రావు సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో హైదరాబాద్ లో మృతి చెందారు.ముప్పై ఏళ్ళుగా ఈనాడు దినపత్రికలో లోకల్ రిపోర్టర్ గా పనిచేస్తున్న నర్సింగ్ రావు జర్నలిస్టు ఫెడరేషన్ వ్యవస్థాపకుల్లో ప్రధాన పాత్ర వహించారు. సంఘం తరపున తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కు నర్సింగ్ రావు గారు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గా పని చేశాం. అంతకుముందు హైదరాబాద్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యదర్శి గా పని చేశారు. సంఘం బాధ్యుడిని జర్నలిస్టుల సమస్యలపై చిత్త శుద్ధితో, అంకిత భావంతో నిస్వార్థంగా పని చేశారు. వృత్తి పట్ల కూడా అంకితభావంతో పనిచేశారు. గత రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. నిరంతరం మెడిసిన్ వాడుతూ అప్పుడప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరి ఆదివారం రాత్రి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున హఠాత్తుగా మృతి చెందారు. నర్సింగ్ రావు కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నర్సింగ్ రావు మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తూ? ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. నర్సింగ్ రావు సంఘానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన మరణం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కు తీరని లోటని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య పేర్కొన్నారు.

## దాసారం గుడిసె వాసులకు పక్కా ఇండ్లను నిర్మిస్తాం : మంత్రి తలసాని



హైదరాబాద్, నవంబర్ 20: దాసారం గుడిసె వాసులకు పక్కా ఇండ్లను నిర్మించి ఇస్తామని సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం సనత్ నగర్‌లోని సాయిబాబా నగర్, దాసారం బస్తీ, దాసారం హట్స్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఆయనకు మహిళలు మంగళహారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దాసారం బస్తీ గుడిసె వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అత్యంత నిరుపేదలు నివసించే ఈ ప్రాంత ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తూ వచ్చామన్నారు.స్థలం విషయం కోర్టులో కేసు నడుస్తుందని, తప్పకుండా కేసును మనమే గెలుస్తామని వారి ధైర్యం చెప్పారు. కేసు పరిష్కరమైన తర్వాత ఉచితంగా పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. మీకు ఏ అవసరమొచ్చిన తానున్నాను అనే విషయాన్ని మరవద్దని చెప్పారు. ఓట్ల కోసం ఎవరెవరో వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రచారంలో మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శేఖర్, నాయకులు సురేష్ గౌడ్, ఖలీల్, కర్ణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమేష్ గౌడ్, ప్రవీణ్, రాజేష్, భద్రయ్య , పుష్పలత, రఘానీస్ తదితరులు ఉన్నారు.

## ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది : మంత్రి తలసాని



హైదరాబాద్, నవంబర్ 20:కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తప్పుడు ప్రచారం, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఈ నెల 25 వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సను నిర్వహి స్తున్నట్లు మంత్రి తెలిపారు. సోమవారం సభ నిర్వ హణ ఏర్పాట్లపై పర్యవేక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులకే గ్యారెంటీ లేని పరిస్థితు ల్లో.. ఆరు గ్యారెంటీలకు దిక్కెక్కడని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని దేశంలోని ప్రధాన నగరాలలో ఒకటిగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. జీవో 58, 59 కింద నగరంలో వేలాదిమందికి ఇంటి స్థలాలను రెగ్యులరైజేషన్ చేశా మని చెప్పారు. సొంత ఇల్లు లేని సు మారు 70 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఉచితంగా అందజే శామని వివరించారు. బహిరంగ సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, అభిమా నులు ఈ సభకు వస్తారని తెలిపారు. 24 ప్రాంతాలలో పార్కింగ్ కు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీలు ప్రభాకర్, బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, కంటోన్మెంట్, నాంపల్లి నియోజకవర్గ అభ్యర్థులు లాస్య నందిత, ఆనంద్ గౌడ్, కంటో న్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కు ల మహేశ్వర్ రెడ్డి, ఉన్నారు.

## సికింద్రాబాద్ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

### - సికింద్రాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగా పాణి




సికింద్రాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకల సారంగా పాణి అన్నారు. అడ్డగుట్ట డివిజన్ లోని నార్త్ లాలగూడ, కట్టెలామండి, హనుమాన్ టెంపుల్, లిల్లీ మోడల్ హై స్కూల్, శేష్ పహాడ్, శాంతి నగర్ వాటర్ ట్యాంక్,ఎస్ ఎఫ్ స్కూల్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి మేకల సారంగా పాణి మాట్లాడుతూ..పదేళ్లుగా సికింద్రాబాద్ ను పాలించిన స్థానిక ఎమ్మెల్యే ఈ నియోజకవర్గమును అభివృద్ధి చేయటంలో విఫలం చెందాడని తెలిపారు.బిజెపి కి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది అని పేర్కొన్నారు. నియోజకవర్గం లో ఏ బస్తీ నీ కూడా అభివృద్ధి చేయలేని సిట్టింగ్ ఎమ్మెల్యే ను మళ్ళీ గెలిపిస్తే మరో ఐదేళ్లు మోసపోతారు అని పేర్కొన్నారు. బిజెపి కేంద్రంలో అనేక ప్రజా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు.దేశ వ్యాప్తంగా మోడీ గాలి వీస్తోందని, తెలంగాణలో బిజెపి సీఎం అభ్యర్థిని ప్రకటించిన ఘనత బిజెపి, మోడీ దే నని పేర్కొన్నారు.

## నగదు, మద్యం, డ్రగ్స్ పట్టివేత ముందు వరుసలో తెలంగాణ రాష్ట్రం

### -రూ.225.23కోట్ల నగదు.. రూ.86.82 కోట్లు విలువ చేసే లిక్కర్, రూ. 103.74 కోట్లు విలువ చేసే డ్రగ్స్, రూ. 191.02 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం

### -కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశంలో ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. చత్తీస్‌గఢ్, మిజోరాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇప్పటికే విడతల వారిగా పోలింగ్ జరిగింది. మరో రెండు రాష్ట్రాలు తెలంగాణ, రాజస్థాన్‌లో త్వరలో పోలింగ్ జరుగనుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో నగదు, మద్యం ఏరులైపారుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు నగదు, మద్యాన్ని పంపిణీ చేస్తున్నాయి. దీనిపై దృష్టి సారించిన కేంద్ర ఎన్నికల సంఘం అనేక ప్రాంతాల్లో రహస్యంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని పట్టుకుంది. అయితే ఏ రాష్ట్రాల్లో ఎంత డబ్బు, మద్యం పట్టుబడిందనే విషయాన్ని సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా.. నగదు, మద్యం, డ్రగ్స్ పట్టివేతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉన్నట్లు వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో రూ.1760 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. మిగతా రాష్ట్రాలకన్నా తెలంగాణ అన్నింట్లో ఫస్ట్ ఉందని తెలిపింది. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా రూ.225.23కోట్ల నగదు పట్టిబడినట్లు పేర్కొంది. తెలంగాణలో రూ.86.82 కోట్లు విలువ చేసే లిక్కర్, రూ. 103.74 కోట్లు విలువ చేసే డ్రగ్స్, రూ. 191.02 కోట్ల విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఓటర్లను మభ్య పెట్టేందుకు ఉపయోగించిన రూ.52. 41 కోట్ల విలువైన వస్తువులను ఎన్నికల కమిషన్ స్వాధీనం చేసుకుంది. మిజోరాంలో లిక్కర్, డ్రగ్స్ మినహా నగదు, విలువైన వస్తువులేమీ పట్టుపడలేదని ఎన్నికల కమిషన్ పేర్కొంది.



# బీసీలకు నాయకత్వం చాతకాదంటున్నా సిఎం కేసీఆర్‌కు బీసీల సత్తా చూపిస్తాం

**-పరకాల నుండి బీసీని అసెంబ్లీ కి పంపుతాం..**
**-బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్**

పరకాల నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బీసీలను,దళితులను ఏ పనీ చేతకానివారని ఆరోపించిన స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈ



వర్గపు ఓట్లు ఎలా అడుగుతాడని ప్రశ్నించారు.. బీసీలకు నాయకత్వం చాతకాదంటున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ కు బీసీ లు తమ శక్తిని, యుక్తిని ప్రదర్శించి ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించి పరకాల నుంచి రిటర్న్ గిఫ్ట్ పంపిస్తామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం పరకాల లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ బీసీలు మెజారిటీగా ఉన్న పరకాల నియోజకవర్గంలో అగ్రవర్ణ ఆధిపత్యం ఇంకెన్నాళ్ళని దాసురేష్ ఆదివారం పరకాల లోని అమరధామం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు.. బీసీ ముఖ్యమంత్రిని బిజెపి ప్రకటించడానికి తాము స్వాగతిస్తున్నామని తప్పకుండా పరకాల నుండి బీసీ అభ్యర్థిని అసెంబ్లీకి పంపడానికి శక్తి వంచన లేకుండా తమ స్థానిక నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి పరకాల నియోజకవర్గ ఇన్చార్జ్ వరికెల కిషన్ రావు నియోజకవర్గ అధ్యక్షులు పొదిలరాజు , బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరకొండ కొమరయ్య రాష్ట్ర యువజన విభాగ సెక్రటరీ ఊరుగొండ శివ తదితరులు పాల్గొన్నారు

# తమిళనాడు గవర్నర్‌పై సుప్రీంకోర్టు సీరియస్

న్యూఢిల్లీ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను ఎందుకు క్లియర్ చేయలేదని అడిగింది. మూడేళ్లుగా గవర్నర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

2020 నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మూడేళ్ల నుంచి ఆయన ఏం చేస్తున్నారని సుప్రీం అడిగింది.

ఇటీవల గవర్నర్ రవి తిప్పి పంపిన 10 బిల్లులను మళ్లీ రాష్ట్ర అసెంబ్లీలో పాస్ చేశారు. సీఎం స్టాలిన్ ప్రత్యేక సమావేశంలో ఆ బిల్లులకు మళ్లీ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

దాంట్లో రెండు అన్నాడీఎంకే సర్కార్ సమయంలో పాస్ చేశారు. తమిళనాడుతో పాటు పంజాబ్, కేరళ రాష్ట్రాలు దాఖలు చేసిన పిటీషన్లపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో తమిళనాడు గవర్నర్ వైఖరిని ప్రశ్నించారు. అసెంబ్లీలో మళ్లీ బిల్లులను పాస్ చేశారని, గవర్నర్‌కు పంపారని, ఆయన ఏం చేస్తారో చూద్దామని కోర్టు పేర్కొన్నది. ఈ కేసును మళ్లీ డిసెంబర్ ఒకటో తేదీకి వాయిదా వేశారు.

# ఈ సంవత్సరం IFFI కోసం ఉత్తేజకరమైన 'మాస్టర్‌క్లాసెస్' మరియు 'ఇన్-కన్వర్సేషన్' సెషన్‌లు

న్యూఢిల్లీ, నవంబర్ 20:మైఖేల్ డగ్లస్, పంకజ్ త్రిపాఠి, జోయా అక్తర్, ఏదైనా తెలిసినవారా? వారు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన చిత్రనిర్మాతలు/నటులు, చలనచిత్ర నిర్మాణం/నటనలో సృజనాత్మక నైపుణ్యాల ద్వారా పలువురి హృదయాలను కొల్లగొట్టిన వారు, భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం యొక్క 54వ ఎడిషన్‌లో సంభాషణ సెషన్‌లను నిర్వహిస్తారు. ఉత్కంఠభరితమైన అభివృద్ధిలో, చిత్రనిర్మాణం యొక్క కళ మరియు క్రాఫ్ట్‌పై దాని మాస్టర్‌క్లాస్‌లు మరియు సంభాషణ సెషన్‌లను నిర్వహించడానికి ఉత్సవం సెట్ చేయబడింది.

ఈ సంవత్సరం ఎఈఈఎలో ప్రముఖ చిత్రనిర్మాతలు, సినిమాటోగ్రాఫర్‌లు మరియు నటీనటులతో 20కి పైగా మాస్టర్‌క్లాస్‌లు మరియు సంభాషణ సెషన్‌లు ఉన్నాయి. గోవాలోని పంజిమ్‌లోని ఫెస్టివల్ మైల్‌లో పునర్నిర్మించిన మరియు పునరుద్ధరించబడిన కాలా అకాడమీలో సెషన్‌లు జరుగుతాయి. బ్రెండన్ గాల్విన్, బ్రిల్లంటే మెండోజా, సన్నీ డియోల్, రాణి ముఖర్జీ, విద్యాబాలన్, జాన్ గోల్డ్ వాటర్, విజయ్ సేతుపతి, సారా అలీ ఖాన్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, కైకే మీనన్, కరణ్ జోహార్, మధుర్ భండార్కర్, మనోజ్ బాజ్‌పేయి, కార్తికి గోన్సాల్వేస్, బోనీ కపూర్, అల్లూరే అరేంద్వి, గ్లక్, గుల్షన్ గ్రోవర్ మరియు ఇతరులు కూడా ఈ సంవత్సరం సెషన్‌లలో పాల్గొంటారు.

దిగ్గజ హాలీవుడ్ నటుడు మరియు నిర్మాత మైఖేల్ డగ్లస్ 'ఒక ప్రపంచ సినిమా కోసం ఇది సమయమా?' అనే అంశంపై ప్రత్యేకమైన సంభాషణ సెషన్‌ను కలిగి ఉన్నందున లోతైన అంతర్దృష్టులు మరియు అర్థవంతమైన ప్రసంగం కోసం అసమానమైన అవకాశం ఉంది. ప్రపంచ ప్రఖ్యాత నటుడు ఎఈఈఎలో ఈ సంవత్సరం ప్రతిష్టాత్మక సత్యజిత్ రే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోబోతున్నారు.

చిత్రనిర్మాణ ప్రక్రియలో అరుదైన సంగ్రహావలోకనం అందించడమే కాకుండా, మాస్టర్‌క్లాసెస్ ఒక లీనమయ్యే అనుభూతిని కలిగిస్తుంది, కథ చెప్పే కళ, సినిమాటోగ్రఫీ మరియు ఫిల్మ్ మేకింగ్ వ్యాపారం వెనుక ఉన్న సృజనాత్మక ప్రక్రియలో పాల్గొనేవారికి 360 డిగ్రీల వీక్షణను అందిస్తుంది. 'ఫిల్మ్ డైరెక్షన్' గురించి పరిశ్రమలోని అత్యుత్తమ బ్రిలంటే మెన్డోజా నుండి నేర్చుకునే అసాధారణ అవకాశాన్ని అందిస్తూ, వర్ధమాన చలనచిత్ర ఆరాధకులకు విలువ జోడింపును అందిస్తామని సెషన్ హామీ ఇచ్చింది.

'మాస్టర్‌క్లాసెస్' మరియు 'ఇన్-కన్వర్సేషన్' సెషన్‌ల యొక్క ఈ వినూత్న పద్ధతి, ప్రపంచ స్థాయి మాస్టర్స్/నిపుణులచే స్వీయ ప్రతిబింబం, జ్ఞాపకాలు మరియు సంభావిత జోక్యాల ద్వారా ఫిల్మ్ మేకింగ్‌లోని విభిన్న విభాగాలను అన్వేషించడానికి చలనచిత్ర ప్రియులకు జీవితకాలంలో ఒకసారి అవకాశం కల్పిస్తుంది.

ఈ సంవత్సరం, స్టోర్‌లో ఉన్న మరిన్ని శుభవార్తలను అందజేస్తూ, మాస్టర్‌క్లాస్‌ల కోసం విద్యార్థులకు ప్రవేశం మరియు నమోదు ఉచితం. మరిన్ని వివరాల కోసం, https://www.iffigoa.org/mcic.php ని సందర్శించండి

# కొత్త CIC శ్రీ హీరాలాల్ సమారియా కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిశారు

న్యూఢిల్లీ, నవంబర్ 20:భారత ప్రధాన సమాచార కమిషనర్, శ్రీ హీరాలాల్ సమరియా ఈరోజు కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఉ టెక్నాలజీ; MoS PMO, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్లు, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్, డాక్టర్ జితేంద్ర సింగ్. ఈ సంవత్సరం RTI పారవేయడం రేటు 90% దాటిందని ఆయన మంత్రికి తెలియజేశారు.

మూడేళ్లపాటు సమాచార కమిషనర్‌గా పనిచేస్తున్న సమరియా 6 నవంబర్ 2023న CICగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత CIC మరియు DoPT మంత్రి మధ్య జరిగిన మొదటి సమావేశం ఇది.

మంత్రితో గంటసేపు జరిగిన సమావేశంలో, 2023-24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమాచార హక్కు (ఆర్‌టిఐ) అప్పీళ్లు/ఫిర్యాదుల పారవేత రేటు మొదటిసారిగా 90% దాటిందని శ్రీ సమరియా మంత్రికి తెలియజేశారు.

ఆర్‌టిఐ అప్పీళ్ల పారవేయడంలో సంబంధిత పెరుగుదలతో పెండింగ్‌లో స్థిరమైన క్షీణతను సాధించినందుకు కేంద్ర సమాచార కమిషన్‌ను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు.

నవంబర్ 9, 2023 నాటికి అందుబాటులో ఉన్న అఎఅ డేటా ప్రకారం, 11,499 ఖీఎ అప్పీళ్లు/ఫిర్యాదులు పరిష్కరించబడ్డాయి, మొత్తం 12,695 స్వీకరించబడ్డాయి, 90.5% పారవేయడం రేటును సూచిస్తుంది. 2022-23లో మొత్తం 19,018 అప్పీళ్లు నమోదు కాగా, 2021-22లో మొత్తం 19,604 అప్పీళ్లు, 2020-21లో మొత్తం 19,183 ఆర్టీఐ అప్పీళ్లు నమోదయ్యాయి. 2022-23లో ఖీఎ అప్పీళ్లకు సంబంధించిన గణాంకాలు 29,210; 2021-22లో, 28,793 అప్పీళ్లు పరిష్కరించబడ్డాయి మరియు 2020-21లో, మొత్తం 17,017 అప్పీళ్లు పరిష్కరించబడ్డాయి. సంబంధిత సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న RTI అప్పీళ్ల బ్యాక్‌లాగ్‌ను కూడా గణాంకాలు కలిగి ఉన్నాయి.

ఆర్‌టిఐల అధ్యయనం, విశ్లేషణ మరియు నమూనా మరియు ఆర్‌టిఐ దరఖాస్తుదారుల ఆధారాలను తనిఖీ చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించిన మొదటి ప్రభుత్వ సంస్థగా ప్రధాన సమాచార కమిషన్ కార్యాలయాన్ని మంత్రి ప్రశంసించారు.

CIC హైబ్రిడ్ మోడ్, - ఫిజికల్ కమ్ వీడియో కాన్ఫరెన్సింగ్, RTI అప్పీళ్ల విచారణ మరియు పారవేయడం కోసం CIC కార్యాలయంలో ప్రవేశపెట్టిన మంత్రికి కూడా తెలియజేసింది.

# చిత్తూరు జిల్లాలో ఏనుగుల బీభత్సం

చిత్తూరు, నవంబర్ 20: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. జిల్లాలోని వి.కోట మండలంలో గజరాజుల గుంపు బీభత్సం సృష్టించింది. తోట కనుమ, గోనమాకులపల్లి, నాగిరెడ్డిపల్లి, బోయకొండలో పలు పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

గజరాజుల సంచారం నేపథ్యంలో స్థానిక గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఏనుగులు సృష్టించిన బీభత్సంతో సుమారు రూ.లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి తమను, తమ పంట పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# జనవరి 22న అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన

**-ప్రతిష్ఠాపన రోజున దేశవ్యాప్తంగా దీపోత్సవం.. వేడుకలు**
**-ఫిబ్రవరి 22 వరకు దేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు రామ్‌లల్లా దర్శనం**

అయోధ్య నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారైంది. జనవరి 22న మధ్యాహ్నం 12.20 గంటలకు కార్యక్రమం జరుగనున్నది. ప్రధాని నరేంద్ర మోదీ మృగశిర నక్షత్రంలో అభిజీత్ ముహూర్తంలో 12.20 గంటలకు రామ్‌లల్లాకు రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. అయితే, కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయి ప్రచారం కల్పించేందుకు సాకేత్ నిలయంలో సంఘ్ పరివార్ సమావేశం జరిగింది. వేడుకల ప్రచారాన్ని నాలుగు దశలుగా విభజించి ముందుకు తీసుకెళ్లాలని భేటీలో నిర్ణయించారు. ఇందులో మొదటి దశ కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభం కాగా.. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నది. కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికను తయారు చేయనున్నారు. ఇందుకు స్టీరింగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా, బ్లాక్ స్థాయిలో పది మందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అయోధ్య రామమందిరం ఉద్యమానికి చెందిన కరసేవకులను సైతం ఈ బృందాల్లో చేర్చుకోనున్నారు. ఇక



జనవరి ఒకటో తేదీ నుంచి రెండో దశ ప్రచారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ పది కోట్ల కుటుంబాలకు అక్షతలు, రామ్‌లల్లా చిత్రపటం, కరపత్రం అందజేయనున్నారు. ప్రతిష్ఠాపన రోజున దీపోత్సవం జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు. జనవరి 22న మూడో దశలో దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగో దశలో దేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు రామ్‌లల్లా దర్శనం కల్పించే యోచనలో ఉన్నారు. రిపబ్లిక్ డే నుంచి ఫిబ్రవరి 22 వరకు కొనసాగనున్నది

# నిలువ హాస్పిటల్,ఎంజీఎం హాస్పిటల్‌లలో పేదలకు అన్నదానం , పండ్లు పంపిణి



హైదరాబాద్ నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరికి పౌష్టికా ఆహారము అందాలన్న సదుద్దేశం తో ఆదివారం నిలువ హాస్పిటల్ అండ్ ఎంజీఎం హాస్పిటల్ యందు పేదలకు అన్నదానం మరియు పండ్లు ఉచితంగా వాటర్ పేదలకు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ అండ్ ఫౌండర్ లైన్ బాబు మిరియం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజును మరియు ఇవాళ దినోత్సవం మంచి కార్యక్రమంలో పేదవారి మధ్యలో చేసుకున్నచో బీదలకు మనము సహాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. మనదేశంలో నిరుపేదలకు పేదవారికి ఎంతవరకూ దాదాపు సంవత్సరం నుండి సేవా కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు విద్యార్థులకు కంటి చికిత్స. దంత చికిత్స షుగర్ బీపీ. వ్యాధులకు. ఉచితంగా మందులు. ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గా రాబోయే నెల చలికాలం గా వస్తుంది చలికాలంలో ఉత్పాత్ లో ఉన్న వాళ్లకు వృద్ధులకు విద్యార్థులకు దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేయాలని డాక్టర్ లైన్ మిరియన్ బాబు నేషనల్ చైర్మన్ కాంపౌండర్. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్. 5000 మందికి దుప్పట్లు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. పేదలకు ఏం సహాయం చేసిన దేవుడు మనకు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేటట్లుగా చూస్తాడు. ఇక్కడ ఎవరు శాశ్వతం కాదు పేదవారికి సహాయం చేసిన వారిని దేవుళ్ళుగా భావించాలని సూచించారు.

# ప్రశాంత తెలంగాణను కాపాడుకుందాం .. కేసీఆర్‌కు పట్టం కడదాం

**-అంబర్ పేట బీ ఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ విజ్ఞప్తి**

హైదరాబాద్ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పచ్చటి తెలంగాణ



ప్రశాంత తెలంగాణ ఉండాలంటే మరోసారి కెసిఆరే ముఖ్యమంత్రి కావాలని అంబర్ పేట శాసనసభ్యులు బిఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. ఈరోజు ఉదయం ఆయన ఓయూలోని మార్నింగ్ వాకర్స్ తదుపరి నల్లకుంట కాచిగూడ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్ల నుండి ప్రశాంతంగా వచ్చగా ఉన్న తెలంగాణను చూసి ఓర్వలేని కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఎలాగైనా అధికారంలోకి రావాలని తెలంగాణ పై విషం చిమ్ముతున్నారని విజ్ఞులైన ప్రజలు గమనించి దశాబ్ది కాలం నుంచి జరుగుతున్న అభివృద్ధిని కొనసాగింపుకు కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేశారు. అంబర్పేట నియోజకవర్గం లో ప్రజలతో సత్సంబంధాలు లేని నాయకులు ఎన్నికల వచ్చి కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని వారికి అంబర్పేట ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ప్రజల ఆశీర్వాదంతో తిరిగి తను గెలుస్తానని రాష్ట్రంలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ ప్రభుత్వం రాబోతుందని ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఆయన వెంట పాల్గొన్నారు

# ఒకటో తేదిన జీతాలు కూడా ఇవ్వని కెసిఆర్‌ను సాగనంపండి - ఓటర్లకు బండి పిలుపు

కరీంనగర్, నవంబర్ 20:ఒకటో తేదికి జీతాలివ్వని స్థితికి తెలంగాణను తీసుకొచ్చిన కెసిఆర్ కు ఓటుతో బుద్ధిచెప్పాలని కరీంనగర్ బిజెపి అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ ఓటర్లుకు పిలుపు ఇచ్చారు.. ఫస్ట్ కు జీతాలే ఇవ్వలేని కేసీఆర్ కు మళ్లీ అధికారిమిస్తే ఇక ప్రజల బతుకులు రోడ్డు మీదే అంటూ వ్యాఖ్యలు చేశారు. వాళ్లది కబ్జాల ఆరాటం?. తనది పేదల పోరాటం అన్నారు. ఎటువైపు ఉంటారో మీరే తేల్చుకోండి అని కరీంనగర్ ప్రజలను కోరారు. కరీంనగర్ నియోజక వర్గం లోని జూబ్లీనగర్, ఫకీర్ పేటలో సోవవారం నాడు నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడుతూ,

" గంగుల కమలాకర్ కు మూడుసార్లు అధికారమిస్తే భూములు కొల్లగొట్టిండు, గుట్టలను మాయం చేసిండు. పొరపాటున ఈసారి మళ్లీ గెలిపిస్తే మీ ఇండ్లను కొట్టేయడం ఖాయం. అబద్ధాలు ఆడడంలో గంగులను మించినోడు లేడు. నన్ను అవినీతిపరుడు అంటున్నాడు. నేను అధికారంలోనే లేను, అవినీతికి ఎలా పాల్పడతాను ? ఒకవేళ అవినీతికి పాల్పడినట్లయితే, నన్ను ఎందుకు అరెస్టు చేయలేదు ? నా ఆస్తిపాస్తుల డాకుమెంట్లు అన్నీ తీసుకురావాలి? అవన్నీ ప్రజలకు ఇచ్చేస్తాను. మరి గంగుల కూడబెట్టిన ఆస్తిపాస్తుల డాక్యుమెంట్లు తీసుకొస్తే, అవన్నీ ప్రజలకు రాసిచ్చేందుకు సిద్ధమా ? కాంగ్రెస్ అభ్యర్థికి కరీంనగర్ గురించే తెలవదు. రేషన్ కార్డులు, పెన్షన్లు ఎలా ఇస్తారో కూడా తెలవదు. భూకబ్జాలు చేయడం తప్ప, ప్రజల కోసం ఎన్నడు కొట్లాడనేలేదు. ఇద్దరు అభ్యర్థులది భూకబ్జాల పంచాయతీ. నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. పేదల కోసం ఎంతకైనా తెగించే నైజం నాది. కాబట్టి, ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని" కోరారు. నిరుద్యోగులు ఏం పాపం చేశారు? ఇంటికో ఉద్యోగం ఏమైంది? అని ప్రశ్నించారు. తన ఇంటిలోని అయిదుగురికి ఉద్యోగాలిచ్చుకున్న కెసిఆర్ తెలంగాణ యవతను రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు బండి సంజయ్.. ముస్లిం ఓట్ల కోసం మసీదులకు వెళ్లి నమాజ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. హనుమాన్ చాలీసాను ఉత్సాహంగా చదివే ధైర్యం ఒవైసీకి ఉందా? సంజయ్ ప్రశ్నించారు..

# నూర్ భాషా ముస్లింమైనారిటీ ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల



ఖమ్మం, నవంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం పట్టణంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటుచేసిన నూర్ భాషా ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు ఇమామ్ భాయ్, బడే సాబ్, అన్వర్, హుస్సేన్ సాబ్, నాగ సైదా, పుసలయ్య, నాగూర్, మీరా సాబ్, గులంపాష, మౌలాలి ఆధ్వర్యంలో తుమ్మల గెలుపు కొరకు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ మంత్రి ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల ద్వారా వెనకబడిన తరగతుల వారికి మేలు చేసే విధంగా ఉన్నాయని తద్వారా మీ జీవితాలు మెరుగు పడు తుందని అన్నారు. నాకు గెలుపు కొరకై ఎనిమిది రోజులు పనిచేయండి ఆ తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి రాజకీయపర మైన అవకాశాలు కమిటీ హాల్ తదితర అంశాలు మీరు అడిగిన సమస్యలన్నీ తీర్చే బాధ్యత మాదని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున నాకు ఆశీర్వదించడానికి వచ్చిన నూర్ భాషా ముస్లిం సోదరులకు నా హృదయపూర్వక అభినందనలు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎలక్షన్ ఇం చార్జ్ అమిత్జ బేగ్, జ్యోతిర్మయ్, తుపాకుల యలగొండ స్వామితో పాటు ఖమ్మం పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులున్నారు.

# పేద ప్రజల దినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు ఉచితంగా బట్టల పంపిణి



రంగా రెడ్డి నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పేద ప్రజల దినోత్సవాన్ని పురస్కరించుకుని టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ కాకుమాను జ్యోతి, ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి రాజేంద్ర నగర్ ఏరియాలో 10 మంది పేదలకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలంకి ఉషా రాణి, కాకుమాను ప్రవీణ్ కుమార్, పోలంకి జగదీష్ కుమార్ పొలంకి వినయ్ మణి సూర్య, పోలంకి టాటా మణి, తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానం
కరిపె రాజ్‌కుమార్ కవితా సంపుటి
ఆజాదీ



ఆవిష్కరణసభ
ముఖ్య అతిథి, ఆవిష్కర్త
శ్రీ కె. ఆనందాచారి
సభాధ్యక్షులు
డా. రూప్‌కుమార్ డబ్బీకార్
విశిష్ట అతిథి
డా. కాంచనపల్లి గోవర్ధన్ రాజు
ఆత్మీయ అతిథులు
శ్రీ కొమ్మవరపు విల్సన్ రావు
శ్రీ ఎం. నారాయణశర్మ
వేదిక: సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్
తేదీ: ఆదివారం, 26 నవంబర్ 2023
ఉదయం 10.30 గంటలకు
- పాలపిట్ట బుక్స్

# కెసీఆర్ పాలనలో నెంబర్ వన్ తాగుబోతుల అడ్డాగా తెలంగాణ -రేవంత్ రెడ్డి..



మెదక్, నవంబర్ 20:బంగారు తెలంగాణ చేస్తానన్న కెసిఆర్ రాష్ట్రాన్నితాగుబోతుల అడ్డాగా మార్చారని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు.. దేశంలో నెంబర్ తాగుబోగు స్టేట్ గా చేసిన ఘనత కెసిఆర్ దే నంటూ మండిపడ్డారు..మెదక్ జిల్లా

నర్సాపూర్. వరంగల్ జిల్లా పరకాలలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి బహిరంగసభలలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన ఒక నమ్మక ద్రోహికి నర్సాపూర్ లో బీఆర్ఎస్ ఇక్కడ టికెట్ ఇచ్చిందని ఫైర్ అయ్యారు?. బంగారు తెలంగాణ చేస్తామన్న కేసీఆర్ బొందలగడ్డ తెలంగాణగా మార్చారన్నారు..

మాట్లాడితే కేసీఆర్ తెలంగాణ నెంబర్-1 అని చెప్తుండు.. రైతుల ఆత్మహత్యల్లో నెంబర్-1 ?నిరుద్యోగ సమస్యల్లో నెంబర్ వన్.. దేశంలోనే నెంబర్-1 తాగుబోతుల అడ్డాగా తెలంగాణను మార్చారు అని ఆయన తెలిపారు. అమ్ముడు పోయి కేసీఆర్ పంచన చేరిన వారిని అసెంబ్లీ గేటు తాకనివ్వద్దు అంటూ ఓటర్లకు పిలుపు ఇచ్చారు. .. . ఇందిరమ్మ రాజ్యం అంటే ఆకలి కేకల రాజ్యం అంటూ కేసీఆర్ వ్యాఖ్యాలను ఖండించిన రేవంత్ '' తండాల్లో మారుమూల పల్లెల్లో పేదలకు నిలువ నీడనిచ్చి.. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన రాజ్యం ఇందిరమ్మ రాజ్యం" అని అన్నారు.

"భూమి ఆత్మగౌరవం.. 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పంచిన రాజ్యం ఇందిరమ్మ రాజ్యం.. దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేసింది ఇందిరమ్మ రాజ్యం.. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన రాజ్యం ఇందిరమ్మ రాజ్యం.. సాగునీటి ప్రాజెక్టులు కట్టి వ్యవసాయానికి సాగునీరు అందించిన రాజ్యం ఇందిరమ్మ రాజ్యం.. స్థానిక సంస్థల్లో ఆడబిడ్డలకు రిజర్వేషన్లు కల్పించిన రాజ్యం ఇందిరమ్మ రాజ్యం.. ఇందిరమ్మ రాజ్యం లేకపోతే.. సోనియమ్మ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం అడుక్కు తినేది. సిద్దిపేటలో సింగిల్ విండో డైరెక్టర్ గా నీకు అవకాశం ఇచ్చింది ఇందిరమ్మ రాజ్యం.. కాంగ్రెస్ కాదా? .. ఆనాడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిన్ను నియమించిన సంజయ్ గాంధీ ఇందిరమ్మ కొడుకు అనే సంగతి మరిచిపోయావా? అని కె సిఆర్ '' ను నిలదీశారు రేవంత్ రెడ్డి.

# రూ.కోటికి పైగా స్వాధీనం ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి ఐదు రాష్ట్రాలలో 1760 కోట్లు నమోదు



న్యూఢిల్లీ, నవంబర్ 20:భారత ఎన్నికల సంఘం యొక్క నిరంతర ప్రయత్నాలు మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ మరియు తెలంగాణా అనే ఐదు రాష్ట్రాలలో మూర్ఛలు గణనీయంగా మరియు విపరీతంగా పెరగడానికి దారితీశాయి. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి ఎన్నికలకు వెళ్లే ఐదు రాష్ట్రాల్లో రూ. 1760 కోట్లకు పైగా జప్తులు నమోదయ్యాయి, ఇది 2018లో ఈ రాష్ట్రాల్లో గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన జప్తుల కంటే 7 రెట్లు (రూ. 239.15 కోట్లు) ఎక్కువ. ఐదు రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలు మరియు గత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ప్రేరేపణలను పర్యవేక్షించడానికి మరియు ఎన్నికల దుష్ప్రవర్తనలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలను అమలు చేయడం ద్వారా ఉచిత, న్యాయమైన మరియు ప్రేరేపణ లేని ఎన్నికలను నిర్ధారించడానికి ఇఅవి యొక్క తిరుగులేని నిబద్ధతను ప్రదర్శిస్తాయి. గుజరాత్, హెచ్‌పీ, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, కర్ణాటక రాష్ట్రాల్లో గత ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 1400 కోట్ల రూపాయలకు పైగా జప్తులు జరిగాయని, ఇది ఈ రాష్ట్రాల్లో గత అసెంబ్లీ ఎన్నికల కంటే 11 సార్లు జరిగిందని గుర్తుచేసుకోవచ్చు.

ఈసారి కమిషన్ ఎన్నికల వ్యయ మానిటరింగ్ సిస్టమ్ (ఇఖటా) ద్వారా పర్యవేక్షణ ప్రక్రియలో సాంకేతికతను పొందుపరిచింది, ఇది ఉత్ప్రేరకంగా నిరూపించబడింది, ఎందుకంటే ఇది మెరుగైన సమన్వయం మరియు గూఢచార భాగస్వామ్యం కోసం కేంద్ర మరియు రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల విస్తృత శ్రేణిని తీసుకువచ్చింది.

ESMS అనేది బహుళ నిరోధం కోసం ఇతర సంబంధిత ఏజెన్సీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను అడ్డగించడం ద్వారా సమాచారాన్ని త్వరితగతిన పంచుకోవడానికి ఉద్దేశించిన ప్రయత్నం. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ ప్రక్రియలో పాలుపంచుకున్న బహుళ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో CEO & DEO స్థాయిలో ESMS సులభమైన సమన్వయాన్ని అందిస్తుంది. ప్లాట్‌ఫారమ్ రియల్ టైమ్ రిపోర్టింగ్‌ను సులభతరం చేస్తుంది, వివిధ ఏజెన్సీల నుండి నివేదికలను సేకరించడం మరియు కంపైల్ చేయడంలో సమయాన్ని ఆదా చేస్తుంది మరియు మెరుగైన సమన్వయం చేస్తుంది. పోల్ జరుగుతున్న రాష్ట్రాల నుండి అందిన నివేదికల ప్రకారం, ఈ అంతర్గత యాప్ బాగా పని చేస్తోంది మరియు ఎన్నికల వ్యయ పర్యవేక్షణ ప్రక్రియలో సహాయపడుతుంది.

ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో మద్యం తయారీని స్వాధీనం చేసుకున్నారు.

రాజస్థాన్‌లో తయారైన మద్యం స్వాధీనం

జూన్ మరియు ఆగస్టు మధ్య ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలకు సీనియర్ డిఇసిలు/డిఇసిల నేతృత్వంలోని బృందాల సందర్శనలతో పర్యవేక్షణ ప్రక్రియ ప్రారంభమైంది, ఇందులో పాల్గొనే క్షేత్ర బలగాలకు వ్యయ పర్యవేక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరియు జిల్లాలతో పరస్పర చర్య నిర్వహించబడింది. మరియు ఎన్నికలకు సన్నద్ధం కావడానికి వారి ఇన్‌పుట్‌లను సమీక్షించడానికి కూడా. తదనంతరం, కమిషన్ ఈ రాష్ట్రాల్లో సమీక్ష సందర్భంగా, ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రేరణల ప్రవాహాన్ని తనిఖీ చేయడంపై జీరో-టాలరెన్స్ విధానాన్ని నొక్కి చెప్పింది మరియు ఈ రాష్ట్రాల్లో నిర్బంధించటం పెరుగుదలలో ప్రతిబింబిస్తుంది. ఈ సందర్శనల రోజు నుండి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తమ తమ డొమైన్‌లలో తమ నిఘాను పెంచాయి మరియు ఎన్నికలు ప్రకటించే సమయానికి, కలిసి, 576.20 కోట్ల రూపాయల స్వాధీనం చేసుకున్నట్లు వారు ఇప్పటికే నివేదించారు.

కమిషన్ ప్రధాన కార్యదర్శులు, డిజిపిలు, ఎక్సైజ్ కమిషనర్లు, డిజి (ఆదాయ పన్ను) మరియు ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలు మరియు వాటి సంబంధిత పొరుగు రాష్ట్రాలు మరియు యుటిల ఇతర సీనియర్ అధికారులతో కూడా సమీక్షలు నిర్వహించింది.

IRS, IC&CES, IRAS, IDAS మరియు ఇతర కేంద్ర ప్రభుత్వ సేవల నుండి 228 మంది అనుభవజ్ఞులైన అధికారులు వ్యయ పరిశీలకులుగా నియమించబడ్డారు. నిశిత పర్యవేక్షణ కోసం, 194 అసెంబ్లీ నియోజకవర్గాలు వ్యయ సున్నిత నియోజకవర్గాలుగా గుర్తించబడ్డాయి. పర్యవేక్షణ ప్రక్రియలో క్షేత్ర స్థాయి బృందాలు తగినంతగా అందుబాటులో ఉన్నాయని మరియు డబ్బు-శక్తి ముప్పును ఎదుర్కోవడానికి DEO లు/SPలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో క్రమం తప్పకుండా అనుసరించడం జరుగుతుందని కూడా నిర్ధారించబడింది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలింగ్ జరుగుతున్న రాష్ట్రాల్లో నిశిత పర్యవేక్షణపై ప్రయత్నాలు కొనసాగుతాయి మరియు పట్టుబడిన గణాంకాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# ఈశాన్య ప్రాంత పర్యాటక సంభావ్యత గురించి అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ టూరిజం మార్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 20:భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ 2023 నవంబర్ 21 నుండి 23 వరకు మేఘాలయలోని షిల్లాంగ్‌లో ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్ యొక్క 11వ ఎడిషన్‌ను నిర్వహిస్తోంది. ఇంటర్నేషనల్ టూరిజం మార్ట్ అనేది రొటేషన్ ప్రాతిపదికన ఈశాన్య రాష్ట్రాలలో ఒకదానిలో మంత్రిత్వ శాఖ నిర్వహించే వార్షిక కార్యక్రమం. , ఈశాన్య వాటాదారులకు దేశంలోని మరియు విదేశీ మార్కెట్లలోని వారి సహచరులతో సంభాషించడానికి అలాగే నార్త్ ఈస్ట్ రీజియన్ (GOI) యొక్క పర్యాటక సంభావ్యత గురించి అవగాహన కల్పించడానికి మరియు దాని ప్రత్యేక పర్యాటక ఉత్పత్తులను హైలైట్ చేయడానికి ఒక పెద్ద వేదికను అందించాలనే లక్ష్యంతో , సుసంపన్నమైన జీవ వైవిధ్యం, దేశీయ మరియు అంతర్జాతీయ ప్రేక్షకులకు స్థానిక సంప్రదాయాలు, నృత్య రూపాలు, కళలు, హస్తకళలు మరియు చేనేతతో సహా ప్రత్యేకమైన అసంపూర్ణ వారసత్వం.

మిషన్ లైఫ్ అమలు కోసం పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, ఊఎ రూపొందించిన యాక్షన్ పాయింట్ల తరహాలో తక్కువ కార్బన్ ఎంపికలను అనుసరించడం ద్వారా గ్రీన్ ఈవెంట్‌గా ప్లాన్ చేయబడినందున ఇంటర్నేషనల్ మార్ట్ కూడా ఒక ప్రత్యేకమైన ఈవెంట్‌గా మారబోతోంది. మరియు టూరిజం వాటాదారులకు అవగాహన కల్పించడం మరియు దాని లక్ష్యాల గురించి మరింత అవగాహన కల్పించడం. (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) వాడకం ఉండదు, డిజిటల్ మరియు పేపర్‌లెస్ మార్గాన్ని అనుసరించడంతోపాటు చెట్ల పెంపకం డ్రైవ్ చేపట్టబడుతుంది.

ఈ కార్యక్రమాన్ని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సహాయ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు మరియు ఈశాన్య టూరిజం మంత్రులు, ఈశాన్య రాష్ట్రాల సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు టూరిజం ఉ హాస్పిటాలిటీ అధిపతులు హాజరుకానున్నారు. సంఘాలు. ఈ మార్ట్ యొక్క మునుపటి ఎడిషన్‌లు గౌహతి, తవాంగ్, షిల్లాంగ్, గాంగ్‌టక్, అగర్తల, ఇంఫాల్, కొహిమా మరియు ఐజ్వాల్‌లలో జరిగాయి. షిల్లాంగ్ ఈ ఈవెంట్‌ను ప్రారంభించినప్పటి నుండి రెండవసారి హోస్ట్ చేస్తుంది. దేశీయ మరియు అంతర్జాతీయ సహా సుమారు 100 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నార్త్ ఈస్టర్న్ వాటాదారులు మరియు దేశీయ మరియు అంతర్జాతీయ కొనుగోలుదారుల మధ్య వ్యాపార సమావేశాలకు అంకితమైన ప్రత్యేక సెషన్ ఉంటుంది. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు తమ కొత్త గమ్యస్థానాలకు సంబంధించిన అప్‌డేట్‌లను అలాగే తమ రాష్ట్రాల్లోని కొత్త అవకాశాలను అందజేస్తాయి. ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలకు చెందిన ప్యానెలిస్ట్‌లతో నాలెడ్జ్ సెషన్‌లు మరియు ప్యానెల్ చర్చలు ప్రాంతంలో కనెక్టివిటీ యొక్క పురోగతి మరియు అభివృద్ధిపై ఉద్దేశపూర్వకంగా ఉంటాయి. గత కొన్నేళ్లుగా ఈశాన్య ప్రాంతంలో ఎయిర్ కనెక్టివిటీ బాగా పెరిగింది. ప్రస్తుతం, నార్త్ ఈస్ట్ రీజియన్‌లోని పర్యాటక ప్రాంతాలకు అందుబాటులోకి 16 కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉన్నాయి. పర్యాటక మంత్రిత్వ శాఖ వారి RCS-UDAN పథకం కింద పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేసింది. ఈ సహకారంలో భాగంగా, 53 పర్యాటక మార్గాలు అందుబాటులోకి వచ్చాయి, వీటిలో 10 మార్గాలు ఈశాన్య ప్రాంతానికి ప్రత్యేకంగా ఉన్నాయి. నార్త్ ఈస్ట్ రీజియన్‌లో నడుస్తున్న 3 విస్టాడోమ్ రైళ్లు కనెక్టివిటీకి మాత్రమే కాకుండా దాని పర్యాటక ఆకర్షణను పెంపొందించడంలో కూడా బాగా దోహదపడ్డాయి.

ఇంకా, ట్రావెల్ ఫర్ లైఫ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, మిషన్ లైఫ్ కింద పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రారంభించిన రంగాల కార్యక్రమం, మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, గమ్యస్థానాలు మరియు పర్యాటకులతో సహా పర్యాటక పర్యావరణ వ్యవస్థలోని అన్ని వాటాదారులతో కలిసి పనిచేస్తోంది. . 2030 నాటికి సుస్థిరమైన మరియు బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో మరియు పర్యాటకాన్ని ఒక వాహనంగా ఉపయోగించడంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారత దేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రోగ్రామ్ ఉద్దేశించబడింది. ఈ మార్ట్ జాతీయ మరియు అంతర్జాతీయ సమావేశాల నిర్వహణ కోసం MoEF రూపొందించిన యాక్షన్ పాయింట్‌లను కూడా సమర్థిస్తుంది.

NERలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు పర్యాటక ప్రమోషన్

ఈశాన్య ప్రాంతంలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు పర్యాటక ప్రోత్సాహక కార్యకలాపాలు పర్యాటక మంత్రిత్వ శాఖ యొక్క ప్రాధాన్యతలలో ఒకటి. స్వదేశ్ దర్శన్ పథకం కింద ఈశాన్య రాష్ట్రాల్లో మొత్తం రూ.1309.00 కోట్లతో 16 ప్రాజెక్టులు మంజూరు చేయబడ్డాయి. పర్యాటక మరియు గమ్యం-కేంద్రీకృత విధానంతో స్థిరమైన మరియు బాధ్యతాయుతమైన గమ్యస్థానాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పునరుద్ధరించబడిన స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద ఈశాన్య ప్రాంతంలో మొత్తం 15 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగింది. ఇంకా, ఈశాన్య రాష్ట్రాల్లో గుర్తించబడిన తీర్థయాత్రల సమగ్ర అభివృద్ధి కోసం ప్రసాద్ పథకం కింద పర్యాటక మంత్రిత్వ శాఖ రూ.256.45 కోట్లతో మొత్తం 8 ప్రాజెక్టులను మంజూరు చేసింది. హైవే నెట్‌వర్క్, వాణిజ్య స్థలాలు, లాజిస్టిక్ పార్కులు, ప్రయాణీకుల సౌకర్యాలైన వేసైడ్ సౌకర్యాలు ( WSA) వంటి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు మరియు సంబంధిత సేవలను అందించడానికి రూ.44.44 కోట్ల వ్యయంతో 22 వ్యూపాయింట్‌ల అభివృద్ధికి పర్యాటక మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. ఈశాన్య ప్రాంతంలో. 1.0 మరియు PRASHAD పథకాల క్రింద మంజూరు చేయబడిన అనేక ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి చేయబడ్డాయి మరియు జాతికి అంకితం చేయబడ్డాయి.

# ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా- ధన్ పాల్

నిజామాబాద్, నవంబర్ 20:: నిజామాబాద్ అర్బన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని.. తాను పక్కా లోకల్ అని? ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపించండని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్ పాల్ సూర్య నారాయణ కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్తులు టూరిస్ట్ నాయకులు అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని 38వ డివిజన్ లోని అరుంధతి నగర్ కాలోని దుబ్బ నుంచి బీజేపీ అభ్యర్థి ధన్ పాల్ సూర్యనారాయణ ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ.. నగరంలో ఃభీఆ, కాంగ్రెస్ అభ్యర్థులు లోకల్ వారు కాదన్నారు. నగరంలో అభివృద్ధి శూన్యమన్నారు. పరాయి వాళ్ళ పెత్తనం మనకెందుకు అని ప్రశ్నించారు. నగరంలో తాను ఎన్నో సంవత్సరాల నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ కార్యక్రమాలు చేస్తూ ఎన్నో దేవాలయాల అభివృద్ధికి సహకరించానన్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో అవినీతి తారా స్థాయికి చేరిందన్నారు. కుటుంబ పాలన పోవాలంటే.. బీజేపీకి మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. మీలో ఒకడిగా ఉంటూ మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు. నగరంలో ఏన్నో సమస్యలు పేరుకుపోయాయన్నారు.

2014 లో డబుల్ బెడ్రూమ్ లు అందజేస్తామని చెప్పి ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. పేదవారి సమస్యలను ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ మేనిఫెస్టో వచ్చాక ఈ సారి బీజేపీ అభ్యర్థులని గెలిపిస్తామనే నమ్మకం ప్రజల్లో కల్గిందన్నారు. 10ఏళ్ల పాలనలో నిరుద్యోగ సమస్యలు పట్టించుకోలేదన్నారు.

బీజేపీ ప్రభుత్వం గల్లీ నుంచి ఢిల్లీ వరకు జెండా ఎగరేస్తుందన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గడ్డం రాజు, శ్రీరామ్, కొండా ఆశన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి,అసంబ్లీ కన్వీనర్ పంచారెడ్డి లింగం, కరిపె గణేష్, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తూప్రాన్ పర్యటనకు ప్రధాని మోడీ-ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

మెదక్, నవంబర్ 20: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ లో సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ క్రమంలో భాగంగా తూప్రాన్ లోని హైదర్ గూడలో టాటా కాఫీ కంపెనీకి దగ్గరగా ఉన్న ఖాళీ స్థలంలో విస్తృత ఏర్పాట్లకు స్థల పరిశీలన జరుగుతున్నది. మోడీ పర్యటన ఈనెల 25వ తేదీన ఉండే అవకాశం ఉంది. ఇందిరాగాంధీ తర్వాత తూప్రాన్ కి భారతదేశ ప్రధానమంత్రి రావడం ఇదే తొలిసారి. తూప్రాన్ రాజేంద్రుడి, నరేంద్రుడి అపూర్వ కలయికకు, అపూర్వ విజయానికి వేదిక కానున్నదని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మల్లారెడ్డి, మెదక్ పార్లమెంటరీ కన్వీనర్ వర్గంటి రామ్మోహన్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సంఖ్య యాదగిరి, మున్సిపల్ శాఖ అధ్యక్షులు మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# శౌర్య ప్రతాపలకు మారుపేరు మహా రాణా ప్రతాప్ సింగ్

## - వైభవంగా మహా రాణా ప్రతాప్ సింగ్ విగ్రహ ప్రతిష్ట



కోటప్పకొండ నవంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); శౌర్య ప్రతాపలకు మారుపేరు మహా రాణా ప్రతాప్ సింగ్ అని పలువురు నేతలు పేర్కొన్నారు. ఆదివారం కోటప్ప కొండలో గల మహా రాణా ప్రతాప్ సింగ్ బొందిలి అన్నదాన సమాజ్ (సత్రం)నందు ఆంధ్రప్రదేశ్ లో మొట్ట మొదటి మహా రాణా ప్రతాప్ సింగ్ విగ్రహం ప్రతిష్ట జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన సత్రం కమిటీ ప్రెసిడెంట్ విజయ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ మహా రాణా ప్రతాప్ సింగ్ బొందిలి కులం వాడు కావడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఆనందకరంగా వుందన్నారు. ఈ విగ్రహాన్ని అఖిల భారత క్షత్రియ మహా సభ వారి సహకారంతో మహా రాణా ప్రతాప్ సింగ్ స్మారక్ అభ్యాన్ నేషనల్ ప్రెసిడెంట్ చంద్రవీర్ సింగ్ నామానా బహుకరించినట్టుగా విజయ్ ప్రతాప్ సింగ్ తెలియజేసారు . విగ్రహ ఏర్పాటు కు సహకరించిన అఖిల భారత క్షత్రియ మహాసభ నేషనల్ ప్రెసిడెంట్ రాజా మానవేంద్ర సింగ్,నేషనల్ లేడి వింగ్ ప్రెసిడెంట్ కరిష్మా హడ,నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భవాని సింగ్ ,నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పందరి బాయి లకు ధన్యవాదాలు తెలిపారు. . ఈ కార్యక్రమానికి బొందిలి కుల మహిళలు వారి సాంప్రదాయ దుస్తులతో రాణా ప్రతాప్ విగ్రహానికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు . కార్యక్రమం లో సత్రం కమిటీ ప్రెసిడెంట్ విజయ్ ప్రతాప్ సింగ్ ,సెక్రెటరీ బాబీ సింగ్ ,ట్రెజరర్ రామ్ బాలాజీ సింగ్ ,మెంబర్స్ వీరాంజి సింగ్ ,చిన్న హనుమాన్ సింగ్ ,హనుమాన్ సింగ్ ,రాణా ప్రతాప్ సింగ్ ,ప్రియా సింగ్ ,సాంబ సింగ్ ,రాంసింగ్ ,ఘన్ సూర్ సింగ్ , లక్ష్మణ్ సింగ్ ,కోట రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సామాజిక భద్రత చట్టం- షబ్బీర్ అలీ



నిజామాబాద్, నవంబర్ 20: శ్రమజీవులకు కనీస సామాజిక భద్రత కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సామాజిక భద్రత చట్టం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి మహ మ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసం ఘటిత శ్రమజీవులకు బతుకు భద్రత లేదని సామాజిక భద్రత లేదని తెలిపారు. సోమవారం నిజామాబాద్ పట్టణం గంజ్ లో హమాలి సంఘం, గుమస్తా సంఘం సభ్యులతో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ సమావేశమై ఎన్నికల్లో మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఉత్పత్తి పంపిణీ రంగాల్లో పనిచేస్తున్న హమాలి, గుమస్తా వర్కర్స్ సేవలు చాలా ముఖ్యమైనవన్నారు. వీరి సేవలు నిలిచిపోతే సరుకులు ఎక్కడికక్కడే ఉండిపోతాయని, ప్రజల వద్దకు సరుకులు చేరకపోతే పరిస్థితులు తీవ్ర సంక్షోభంగా మారుతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 600 రైస్ మిల్లులు, మార్కెట్, వ్యవసాయ, ఉత్పత్తుల ఎగుమతి దిగుమతుల్లో పట్టణ ప్రాంతాల్లో దుకాణాల్లో సివిల్ సప్లై ఎఫ్సిఐ గోడౌన్ ట్రాన్ ఫోర్ట్, పరిశ్రమల్లో లక్షల మంది హమాలీ, గుమస్తాలు పనిచేస్తున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వారికి కార్మిక సామాజిక భద్రత చట్టం ఏర్పాటు చేసి వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. హమాలీ కార్మికులు, గుమస్తాలు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీనీ గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి మైదాన్‌లోని 42వ భారత అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన 2023లో ఆయుష్మాన్ భవ హెల్త్ పెవిలియన్‌ను సందర్శించిన కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, నవంబర్ 20:కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈరోజు ప్రగతి మైదాన్‌లోని 42వ భారత అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ఆయుష్మాన్ భవ హెల్త్ పెవిలియన్‌ను సందర్శించారు. ఈ సంవత్సరం ట్రేడ్ ఫెయిర్ యొక్క థీమ్ "వసుధైవ కుటుంబకం, యునైటెడ్ బై ట్రేడ్", అయితే హెల్త్ పెవిలియన్ యొక్క థీమ్ "ఆయుష్మాన్ భవ".

డాక్టర్ మాండవ్య హెల్త్ పెవిలియన్‌లోని వివిధ స్టాల్స్ మరియు బూత్‌లను సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు మరియు ప్రభుత్వ పథకాలను ప్రదర్శించారు, నుక్కడ్ నాటకం, ఆటలు, క్విజ్‌లు మరియు డివిజన్ ప్రతినిధుల ద్వారా విజ్ఞానాన్ని అందించడం మరియు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రజలలో అవగాహన పెంచడానికి వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రజలు.

పెవిలియన్‌ను అన్వేషిస్తున్నప్పుడు, అతను వివిధ ఆరోగ్య బూత్‌లు మరియు స్టాల్స్‌లో వివిధ ఇంటరాక్టివ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ బూత్‌ను సందర్శించిన సందర్భంగా, డాక్టర్ మాండవ్య ప్రజల కోసం అందించిన సేవలు మరియు సమాచారాన్ని ప్రతిబింబించారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన స్టాల్‌లో ఆయన లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్డులు నిరుపేదలకు ఉచిత ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాల చివరి మైలు పంపిణీని నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కేంద్ర ఆరోగ్య మంత్రి కూడా జన్ ఔషధి స్టాల్‌ను సందర్శించారు మరియు సందర్శకులతో సంభాషించారు మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఈ దుకాణాల నుండి జనరిక్ మందులను కొనుగోలు చేయాలని వారిని కోరారు.

# పొంగులేటికి మద్దతుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ మీడియా సమావేశం



ఖమ్మం, నవంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి. కృష్ణారావు పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మద్దతుగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కెసిఆర్ కు రెండుసార్లు అధికారాన్ని కట్టబెట్టిన తెలంగాణ ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేశారు. ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారు. కెసిఆర్ పాలనలో లాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా, కాళేశ్వరం ప్రాజెక్ట్ మాఫియా, మిషన్ భగరిథ మాఫియా, హరితహారం మాఫియా, మద్యం మాఫియా, డ్రగ్స్ మాఫియా, ఇసుక మాఫియాడపారిశ్రామిక మాఫియా ఈ విధంగా పలు రకాల మాఫియా రూపంలో కెసిఆర్ కుటుంబం తెలంగాణ ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని 5 లక్షల కోట్ల రూపాయలు అప్పుల పాలు చేశారు.

దీని ఫలితంగా ప్రతి పౌరుడి నెత్తిమీద ఒక లక్షా పాతిక వేల రూపాయల అప్పు భారం పడుతుంది. కాబట్టి తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞతగా ప్రజా తెలంగాణ కోసం ప్రతి ఉద్యమకారుడు తనవంతుగా పది ఓట్లు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు వేపియ్యాలని కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ బచ్చాల పద్మాచారి, జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు భూక్యా రాంబాబు నాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, బట్టు రాజేందర్ నాయక్, బెల్లంకొండ నాగేశ్వరావు, యాదగిరి చారి, సంగయ్య, సైదులు, దొడ్డ శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండల కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏం పనులు జేసిండు..?: సీఎం కేసీఆర్




నల్గొండ, నవంబర్ 18: కాంగ్రెస్ 50 ఏండ్ల హయాంలో తనకంటే దొడ్డుగ, ఎత్తుపొడుగు ఉన్నోళ్లు చాలా మంది ముఖ్యమంత్రులు అయ్యింండ్రని, కానీ ఎవరు గూడా తెలంగాణ ప్రాంతానికి కనీసం మంచి నీళ్లు ఇయ్యలేదని సీఎం కేసీఆర్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణం అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నల్లగొండ నియోజకవర్గం, పట్టణం అభివృద్ధి చెందాయని చెప్పారు.

'కేసీఆర్ కంటే దొడ్డుగ, ఎత్తుగ ఉన్నోళ్లు చాలా మంది కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రులు అయ్యింండ్రు. కానీ ఎవరు గూడా తెలంగాణకు మంచినీళ్లు ఇయ్యలే. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉండె తెలంగాణకు మంచినీళ్లు కూడా ఇయ్యలేక పోయింండ్రు. కరెంటు ఇయ్యలే. మరె ఇయ్యాల కరెంటు ఎట్ల వచ్చింది..? మంచి నీళ్లు ఎట్ల వచ్చినయ్..? మీరు ఆలోచించాలె. పోయిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు నల్లగొండ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తనని చెప్పిన. మధ్యల కరోనా వచ్చి ఓ ఏడాది ఆలస్యమైనా.. ఆ తర్వాత తగిల్నమంటే నల్లగొండ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఇదంతా మీ కళ్ల ముందు ఉంది. నల్లగొండకు ఐటీ టవర్ కూడా వచ్చేసింది. వెయ్యి, పదిహేను వందల మందికి ఉద్యోగాలు దొరుకుతున్నయ్' అని సీఎం తెలిపారు.

'అంతకుముందు రెండు దశాబ్దాలు ఇక్కడ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గారు ఎమ్మెల్యేగా ఉండె. ఆయన కాలంలో నల్లగొండ పట్టణం ఎట్లుండె..? మంచి నీళ్లు ఎట్లుండె..? కరెంటు ఎట్లుండె..? పని ఏం జరిగింది..? వట్టిగ అడ్డం పొడుగు మాట్లాడు గాదు. నల్లగొండ పట్టణం అప్పుడెట్లుండె, ఇప్పుడెట్లుంది..? అనేది ఆలోచన చేయండి. బీఆర్ఎస్ వచ్చినంక రూ.200 ఉన్న పెన్షన్ రూ.2 వేలు అయ్యింది. భవిష్యత్‌లో దాన్ని రూ.5 వేలకు పెంచుతం. ఆరోగ్యం విషయంలో మేం ఎన్ని చర్యలు తీసుకున్నవో మీరు చూస్తున్నరు. 50 ఏండ్ల కాంగ్రెస్ రాజ్యంలో పాత నల్లగొండ జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ రాలే. ఇయ్యాల మూడు మెడికల్ కాలేజీలు వచ్చినయ్. నల్లగొండలో ఐదారు వందల బెడ్లతోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వచ్చింది. అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ ముందుకు పోతున్నం' అని చెప్పారు.

'ఇక్కడి రైతాంగానికి నేను మనవి చేస్తున్నా. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పూర్తయ్యింది. లక్షల ఎకరాలకు కొత్తగా సాగు నీరు వస్తది. ఉదయ సముద్రం గతంలో ఎట్లుండె, ఇప్పుడెట్లుంది..? ఇయ్యాల ఉదయ సముద్రం కింద చాలా చక్కటి పంటలు పండుతున్నయ్. ఇవన్నీ మీరు ఆలోచించాలె. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మూడు గంటలే కరెంటు ఇస్తమని ఆ పార్టీ నాయకులు చెప్తున్నరు. ధరణిని తీసేస్తమంటున్నరు. ఇంకా చాలా మాటలు మాట్లాడుతున్నరు. కేసీఆర్‌కు పనిలేక రైతుబంధు ఇచ్చి వేస్ట్ చేస్తున్నడు అంటున్నడు. రైతుబంధు ఎట్ల వేస్ట్ అయితది..? మీరు మళ్ల భూపాల్‌రెడ్డిని గెలిపియ్యండి.. రైతుబంధును రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతం. కరెంటు మూడు గంటలు చాలు అంటున్నరు. మూడు గంటల కరెంటు సరిపోతదా..? మరె 24 కరెంటు ఉండాల్నంటె గూడా భూపాల్‌రెడ్డి గెలువాలె' అన్నారు.

'మూషంపల్లిలో బోర్ల రాంరెడ్డి అనే రైతు 54 బోర్లు వేసిండు. అయినా నీళ్లు పడలే. తెలంగాణలో బోర్లు, బావుల మీదనే వ్యవసాయం ఎక్కువ ఆధారపడి ఉంటది. మరె కరెంటు లేకపోతే మోటార్లు ఎట్ల పోస్తయ్..? కాంగ్రెసోళ్లు ఇంకేమంటున్నరు..? రైతులు 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలె అంటున్నరు. రైతుల దగ్గర 10 హెచ్‌పీ మోటార్లు ఉంటయా..? మరె రాష్ట్రంలో 30 లక్షల బోర్లకు 10 హెచ్‌పీ మోటార్లు ఎట్ల రావాలె. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తరట. భూమాత పోర్టల్ తెస్తరట. అది భూమతనో మరె భూమేతనో..! బీఆర్ఎస్ ప్రభుత్వంలో మీ భూమిని మరొకరి పేరు మీదకు మార్చే అధికారం ముఖ్యమంత్రికి కూడా లేకుండా చేసినం. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, లంచాల గోల లేకుండా రైతుబంధు మీ బ్యాంకుల ఖాతాల్లో పడేటట్లు చేసినం. మరె కాంగ్రెస్ వచ్చి ధరణిని తీసేస్తే పాత రోజులే వస్తయ్. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లయితది' అని సీఎం హెచ్చరించారు.

# చంద్రబాబుకు ఏపీ హైకోర్టులో రెగ్యులర్ బెయిల్ మంజూరు

**–బెయిల్‌కు అంతకుముందు ఉన్న షరతులన్నింటినీ 29 నుంచి తొలిగింపు**

అమరావతి నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టులో రెగ్యులర్ బెయిల్ లభించిన సంగతి తెలిసిందే. ఈనెల 29 నుంచి బెయిల్‌కు అంతకుముందు ఉన్న షరతులన్నింటినీ తొలగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే.. బెయిల్ రెగ్యులర్ విషయమై 39 పేజీల తీర్పును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మల్లిఖార్జునరావు వెల్లడించారు. ఇందులో ఉన్న ముఖ్యమైన విషయాలు ఏంటి..? షరతులు ఏంటి..? అనే విషయాల్లోకి వెళితే ...

**హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఏముందంటే..**

–స్కిల్ కేసు 2021 డిసెంబర్ 9న కేసు నమోదైంది

–చంద్రబాబుపై 2023 సెప్టెంబర్ 9న కేసునమోదు చేశారు

–అప్పటి నుంచి ఆయన ఈ కేసులో జోక్యం చేసుకున్నట్లుగానీ రికార్డులను టాంపర్ చేసినట్లుగానీ ప్రాసిక్యూషనే చెప్పలేదు

–సబ్ కాంట్రాక్టర్ పన్ను ఎగవేస్తే, చంద్రబాబుకు ఏం సంబంధమని న్యాయవాది లూథ్రా చేసిన వాదనతో ఏకీభవిస్తున్నాం

–చంద్రబాబుకు ఈ కాంట్రాక్టులో ఉల్లంఘనలు ఉన్నాయని అధికారులు చెప్పారన్న అంశానికి సాక్ష్యాలు లేవు

–ఈ కేసులో ఇప్పటికే 149 మంది సాక్షులను విచారించి 4 వేల పేజీల డాక్యుమెంట్లు సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది

**ఇవీ అసలు విషయాలు..!**

–ఇప్పటికీ ఈ డాక్యుమెంట్లు సీఐడీ ఆధీనంలో ఉండటంతో చంద్రబాబు వీటిని ట్యాంపర్ చేసే అవకాశం లేదు

–జడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న చంద్రబాబు పారిపోయే అవకాశం లేదు

–సాక్షులను చంద్రబాబు ప్రభావితం చేస్తున్నారని సీఐడీ తరపున లాయర్లు చేసిన వాదనలకు ఆధారాలు లేవు

–స్కిల్ కేసులో సుజయత్ ఖాన్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ప్రాథమిక సాక్ష్యాలు కూడా లేవు

–చంద్రబాబు మాజీ పీఏ పెండ్యాల శ్రీనివాస్ విచారణకు గైర్హాజరుకు చంద్రబాబు బెయిల్ పరిశీలనకు ఎటువంటి సంబంధం లేదు

– చంద్రబాబు కీలక సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సీఐడీ చేసిన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు చూపలేకపోయారు

–చంద్రబాబుకు ఇచ్చిన మధ్యంతర బెయిల్ నేపథ్యంలో హైదరాబాద్‌లో నమోదైన కేసులో బెయిల్ షరతులను ఉల్లంఘించట్లుగా పరిగణించడం లేదు

–స్కిల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీఐడీ ఎటువంటి ఆధారాలు చూపించలేకపోయింది

–నిధులు విడుదల చేయమన్నంత మాత్రాన నేరంలో పాత్ర ఉందని చెప్పలేమని పేర్కొన్న హైకోర్టు .

# సనాతన ధర్మపీఠం సింహాచలం ఆధ్వర్యంలో బ్రహ్మంగారి జయంతి మహోత్సవాలు



సింహాచలం నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సింహాచలంలో పుష్కరణీ సత్రం వద్ద శ్రీమద్విత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జయంతి కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర సనాతన ధర్మ పీఠం సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆరు రోజులు పాటు శ్రీ సాంబమూర్తి గారి బృందం వారిచే ఘనంగా జరిగాయి. చివరి రోజు నందికొండ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శ్రీకాంతేంద్ర స్వామి వారు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్, విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివకోటి వాసు, ప్రముఖ న్యాయవాది అడవికొలను, వేణుగోపాలకృష్ణ, గుంటపల్లి ప్రసాదు, చిట్టూరి సర్వేశ్వరరావు, తాతాజీ పెద్ద ఎత్తున మహిళా భక్తులు విశాఖ చుట్టుపక్కల ఉన్న పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

# తాడికొండలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



న్యూఢిల్లీ, నవంబర్ 20:పారవ్తీపురం మన్యం జిల్లాలో ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు విశేష ఆదరణ లభిస్తోంది. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండలంలో వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం మండల నోడల్ అధికారి,శ్రీ ఎస్. సాల్మాన్ రాజు, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తాడికొండ,లంబేసు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను, ఆయుష్మాన్ భారత్; ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన; జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ; ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ); పిఎం ఉజ్వల యోజన ; పిఎం విశ్వకర్మ; పిఎం కిసాన్ సమాన్ ; కిసాన్ క్రెడిట్ కార్డ్ హర్ ఘర్ జల్ – జల్ జీవన్ మిషన్; జన్ ధన్ యోజన; జీవన్ జ్యోతి బీమా యోజన; సురక్ష బీమా యోజన; అటల్ పెన్షన్ యోజన తదితర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీమతి రాధిక, జిఖిఅ, శ్రీ ఓ. జగ్గారావు సర్పంచ్ పాల్గొని వికసిత్ భారత్ సంకల్ప్ ప్రతిజ్ఞ చేయించారు. వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ల వినియోగం, నిపుణులు అధికారులు వివరించారు సెక్రటేరియట్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.అదేవిధంగా లంబేసు గ్రామం లో జరిగిన కార్యక్రమం లో శ్రీమతి ఎం గౌరమ్మ, ఎంపిటీసీ, శ్రీమతి బి టి సీతమ్మ, సర్పంచ్, సచివాలయం మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో అడ్డగుట్టదే అగ్ర స్థానం

**–సికింద్రాబాద్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్**



సికింద్రాబాద్, నవంబరు 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మళ్లీ దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూధీన అడ్డగుట్టను ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో అభివృద్ధికి చిరునామాగా మార్చామని సికింద్రాబాద్ ను జంటనగరాల్లోని అభివృద్దిలో అగ్ర కేంద్రంగా తీర్చిదిద్దిన ఘనత తమదేనని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. అడ్డగుట్ట లోని వివిధ బస్తీల్లో పద్మారావు గౌడ్ తన ఎన్నికల ప్రచారాన్ని స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ తో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టామని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో తమదే అగ్ర స్థానమని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. స్థానికుల అభిమతాలకు అనుగుణంగా అడ్డగుట్టలో అన్ని సదుపాయాలను కల్పించేందుకు తాము ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట ప్రజల చిరకాల స్వప్నం నేరవేర్చేలా ఇటీవల రూ.72 కోట్లతో తుకారాం గేటు ఆర్ యు బీ నిర్మించామని, వారి ప్రయోజనార్ధమై రూ.13 కోట్ల ఖర్చుతో ఆసుపత్రి ని నిర్మిస్తున్నామని తెలిపారు. సితాఫలమండీ ప్రభుత్వ స్కూల్ లో కొత్త జూనియర్, డిగ్రీ కాలేజీల ను తామే నెలకొల్పామని, వాటికీ కొత్త భవనాలను నిర్మించే బాధ్యతను కుడా తామే చేపట్టి ముఖ్యమంత్రి గారి నుంచి రూ.30 కోట్ల మేరకు ప్రత్యేక నిధులను సాధించామని తెలిపారు. అదే విధంగా కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రికి రూ.12 కోట్ల మేరకు నిధులను సమకూర్చి కొత్త భవనాలను నిర్మిస్తున్నామని వివరించారు. అడ్డగుట్ట బీ సెక్షన్, డీ సెక్షన్, వడ్డెర బస్తీ, రియో పాయింట్, తుకారం గేటు, తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో స్థానికులు పద్మారావు గౌడ్ డివిజన్ పరిధిలో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో అడ్డగుట్ట నాయకులు, కార్యకర్తలు పద్మారావు తో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పద్మారావు గౌడ్ నిర్వహించిన పర్యటనలో పలువురు ఇతర పార్టీ ల నేతలు కూడా పాల్గొని ఆయనకు మద్దతు తెలపడంతో పాటు బీ ఆర్ ఎస్ లో చేరారు. అడ్డగుట్ట టీ డీ పీ సీనియర్ నేత గణేష్ దంపతులు, అనుచరులు పద్మారావు గౌడ్ సమక్షంలో బీ ఆర్ ఎస్ లో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు

# బూడిదను అమ్ముకునే బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి

**–రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్**



గోదావరిఖని నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) బూడిద దోపిడీ చేసి రామ గుండాన్ని రావణ కాష్టంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్ అన్నారు ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖని, సింగరేణి ఎస్ అండ్ పిసి సిబ్బందిని రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని దోపిడీ పాలన చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఉద్యోగాలు లేక యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నరాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**వాకర్స్ ను కలిసిన రాజ్ ఠాకూర్**

గోదావరిఖని: పిజి కాలేజీ గ్రౌండ్ లో సోమవారం ఉదయం రామగండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వాకర్స్ ను కలిసి చేతి గుర్తుకు ఓటు వేసి నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు ఉన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రైవేట్ ఎలక్ట్రీషన్లు**

గోదావరిఖని–: ప్రైవేట్ ఎలక్ట్రీషన్లు సోమవారం రామగండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈ ప్రాంతంలో దోపిడీ పాలన జరుగుతుందాని, మాయ మాటలతో మోసం చేసే బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రజా హితం కోరే కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి గంట్లకుంట నుండి భారీ చేరికలు



మహబూబాబాద్, నవంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): పాలకుర్తి నియోజకవర్గం పెద్దవంగర మండలంలోని కాన్వయ గూడెం, గంట్లకుంట, కొరిపెల్లి, మొత్య తండా, పోచారం, వడ్డెకొత్తపల్లి, పెద్దవంగర గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గడపగడప ప్రచార కార్యక్రమం నిర్వహించారు.గంట్లకుంట గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్తినేని సోమన్న, గౌరవ అధ్యక్షులు ముక్తార్ పాష ఆధ్వర్యంలో పాలకుర్తి నియోకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని రెడ్డి కి వస్తున్న ఆదరణ చూసి బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి 10వ వార్డు మెంబర్ వయ్యావుల లచ్చుమ్మ,బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు చింతకింది ఆంజనేయులు, ముదిరాజ్ సంఘం నుండి,పెరిక సంఘం నుండి వారి కుటుంబాలు,రామోజీ తండా నుండి 20 కుటుంబాలు,అమర్ సింగ్ తండా నుండి 10 కుటుంబాలుయశస్వినీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాలను ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే రూ.2 లక్షల పంట రుణాలు ఒకేసారి మాఫీ,వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు నిరంతరాయ ఉచిత విద్యుత్ అందిస్తుందని, ఇళ్లు లేని పేదలకు ఒక్కొక్కరికి 5 లక్షలు,ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఈ పథకాలు గ్యారెంటీగా అమలు చేస్తామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు కుమార్తె శైలజ, ముత్యాల పూర్ణచందర్,తోటకూరి శ్రీనివాస్, ఒరిగంటి సతీష్, పన్నీరు వేణు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎరుకల సమ్మయ్య గౌడ్, కొండ్రాతి శ్రీనాథ్, తాటిపాముల సంపత్, కన్నె సతీష్, చింతల వెంకటయ్య, బండి లచ్చయ్య,చెరుకు సత్యం, మద్దే నాగేశ్వరరావు, ఎరుకల యాకయ్య, కన్నె సంతోష్, ముక్కవుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి.. రోడ్ షో లో పాల్గొన్న ఈటెల

మహబూబ్‌నగర్, నవంబర్ 20:ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో నేతలు ప్రచారాల్లో స్పీడ్ పెంచారు. ఈసందర్భంగా బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిం చారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం హన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షో లో ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. స్థానిక బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ నిర్వహించిన భారీ ర్యాలీలో ఈటెల రాజేందర్ ఓటర్లను అభ్యర్థించారు.

# మోసకారి ఎవరైనా ఉంటే అది కేసీఆర్ మాత్రమే!

**– బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్**

మహబూబ్‌నగర్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బీజేపీ అభ్యర్థి మిథున్ రెడ్డి ప్రచార ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలమూరు ఎంపీగా సీఎం కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణా బిల్లు పాస్ అయ్యిందని.. కానీ ఇక్కడి మహిళలు, ప్రజల పేదరికం అట్లే ఉందని విమర్శించారు. మోసకారి ఎవరైనా ఉంటే అది కేసీఆర్ అని వ్యాఖ్యలు చేశారు. ఎన్నో మోసపు మాటలు చెప్పి పదేళ్లు మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. "మీ ఆశీర్వాదంతో బీజేపీ అధికారంలోకి వస్తే.. మీకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తాము. ఉద్యోగాల పేరుతో 30 లక్షల యువతను మోసం చేసి.. నోటిఫికేషన్‌లు ఇచ్చి పేపర్‌లు లీక్ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్.. జాబ్ కాలెండర్ ప్రకారం భర్తీ చేస్తాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. కిలో తరుగు లేకుండా మీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం" అని ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు.

# మజ్లిస్‌ను ఓడించేందుకు అన్ని వర్గాలూ సహకరించాలి

**– కార్వాన్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి టి అమర్సింగ్**

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గతంలో బీజేపీకి కంచుకోట లాంటి కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో గడిచిన రెండు దశాబ్దాలుగా మతోన్మాద మజ్లిస్ పార్టీ కుట్రపూరితంగా ఓట్లు చీల్చి పాగా వేసిందని, అలాంటి మజ్లిస్ పార్టీని, ఈసారి ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించేందుకు అన్ని వర్గాల ప్రజలూ తనకు సహకరించాలని కార్వాన్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి టి అమర్సింగ్ కోరారు. సోమవారం అమర్సింగ్ కార్వాన్ నియోజకవర్గంలోని గుడిమ ల్కాపూర్, కార్వాన్ పరిసర ప్రాంతాలలో ఇంటింటి ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఓటర్లను కల్సుకుని కమలం పువ్వు గుర్తుకే ఓటేసి బీజేపీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు మజ్లిస్– బీఆర్ఎస్ పార్టీల చీకటి పొత్తును చిత్తు చేసే సత్తా బీజేపీ ఒక్క పార్టీకే ఉందన్న వాస్తవాన్ని ప్రజలంతా సమిష్టిగా కమలానికి ఓట్లు వేసి నిరూపించాలని ఓటర్లకు అమరిసంగ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు యోగిరాజ్సింగ్, కార్వాన్ బీజేపీ కన్వీనర్ గోవర్ధన్, దొర్తుల శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఓటర్లను విశేషంగా ఆకట్టుకుని ఆలోచింపజేశాయి.

